ఇంటికి దీపం
ఇల్లాలని అనుకున్న
ఆ ఇల్లాలికి తెలిసిన
వాస్తవం?

# అనగనగా ఓ ఇంట్లో




''అమ్మా నా రెడ్ షల్వార్ ఇస్త్రీ చేసిపెట్టావా?''

''మమ్మీ షూ పాలిష్ ఎక్కడుందో కొంచెం త్వరగా వెదికిపెట్టు''

''సుశీ... సుశీలా.. షేవింగ్ క్రీమ్ అయిపోయిందని చూడలేదా? ఇప్పుడెలా? ఇల్లాలన్నాక కాస్త శ్రద్ధ వుండాలి''

''సుశీలమ్మతల్లీ కాస్త గొంతు తడిపేదేమన్నా వుందా? మొహం కడుక్కుని ఇంతసేపైంది కాఫీ చుక్కకి గతిలేదే తల్లీ!'' అత్తగారి సణుగుడు వినిపిస్తోంది.


ఒక చేత్తో మూకుడులోని కూరముక్కలు కదుపుతూ, టెన్షన్‌గా పక్కనే పెట్టిన పాల గిన్నెవైపు చూస్తున్న సుశీలకి అందరి కేకలూ వినిపిస్తూనే వున్నాయి. ''ఆ వస్తున్నా'' అని రెండుసార్లు బదులిచ్చింది కానీ కదిలితే పాలు పొంగిపోతాయేమోనని భయం.

''అమ్మా నా కాలేజీ టైం అవుతోంది. పిలుస్తుంటే వినవేం?'' మాధవి కాళ్లు బాదుతూ అరుస్తోంది.

''పెద్ద ముంచుకుపోదులే ఓ రోజు లేట్‌గా వెళ్తే... అసలు మీరు చదవడానికి వెళ్తున్నారా, లేక ఫ్యాషన్ పెరేడ్‌కి వెళ్తున్నారా... మమ్మీ నాకు మ్యాచ్ వుంది, అర్జంట్‌గా టిఫిన్ పెట్టెయ్యి'' రవి అరిచాడు.

''నా కాలేజీ గురించి మాట్లాడ్తే పళ్లు రాలకొడ్తా. పెద్ద ప్లేయర్‌లా పోజులు. అక్కడికి వెళ్లి ముష్టివాడిలా చేతులుజాపి ఫీల్డింగ్ చేస్తూ పడుంటావు!'' మాధవి ఉక్రోషంగా అంది.

''మాటలు తిన్నగా రానీ... పెట్టి కొట్టానంటే!'' రవి దూకుడుగా మీదకి వెళ్తూ



అన్నట్లున్నాడు.

కురుక్షేత్ర సంగ్రామం కొద్దిసేపట్లో మొదలవబోతోందని, మెల్లగా అతిరథులైన అత్తగారూ, భర్తకూడా అందులో చోటుచేసుకుని రణరంగాన్ని పరిపూర్ణం చేస్తారనీ సుశీలకి అర్థం అయిపోయింది.

''అబ్బా... ఎందుకర్రా అస్తమానం అలా విరోధుల్లా పోట్లాడుకుంటారూ?'' అని గరిటతో

వంటింట్లోనుండి బయటకు వచ్చింది. సమయం కోసమే కాచుకుని వున్నట్లు పాలు బుస్సున పొంగిపోయాయి!

''అయ్యో... ఇప్పటిదాకా ఇక్కడే వున్నాను. నా ఖర్మ!'' అంటూ లోపలకి పరిగెత్తింది సుశీల.

రెండు దభీ దభీ చప్పుళ్లూ ఆ తర్వాత కీచుగా అరిచిన అరుపూ... ఆ పైన ఫైరింగ్‌లాంటి భర్త గొంతూ, అత్తగారి సన్నాయి నొక్కులతో సుశీలకి సీన్ అంతా ఇంగ్లీష్ సినిమాలా అర్థమైపోతూనే వుంది.

''అసలు మిమ్మల్ని కాదురా - మిమ్మల్ని ఇలా పెంచుతున్న మీ అమ్మని అనాలి! ఎంత గొంతు చించుకున్నా ఆ మహారాణి తన సామ్రాజ్యాన్ని వదిలి బయటకురాదుగా'' అంటున్నాడు రాఘవ.

''భూమి గుండ్రంగా వుంది'' అన్నట్లు సమస్య ఎన్నిచోట్లు తిరిగినా తిరిగి తిరిగి తన దగ్గరకే వచ్చి ఆగుతుందని సుశీలకి తెలుసు. కాఫీ గ్లాసులు ట్రేలో పెట్టుకుని బయటకు వస్తూ ''మాధవీ... పెద్దదానివి నీకేవిటి వాడితో గొడవ!'' అని కూతుర్ని మందలించబోయింది.

మేఘావృతమైన ఆకాశం ఒక్కసారిగా వర్షిస్తున్నట్లుగా మాధవి ''చూశారా నాన్నా! అమ్మకి ఎప్పుడూ పక్షపాతమే. వాడ్ని గారాబం చేసి నెత్తికి ఎక్కించుకుంది. అందుకే అలా తయారయ్యాడు'' అని ఏడుపు మొదలుపెట్టింది.

''నిన్ను గారాబం చెయ్యకుండానే ఇలా తయారయ్యావా?'' కాస్త విసుగ్గా అడిగింది అత్తగారికి కాఫీ ఇస్తూ సుశీల.

''చిన్నపిల్ల. దాన్ని ఎందుకు అంటావు. అసలు నువ్వు పిల్లల విషయాలూ, నా విషయాలూ పట్టించుకోకపోవడంవల్లకదా ఈ గొడవంతా!'' అన్నాడు చిరచిర్లాడుతూ రాఘవ.

''అది చిన్నపిల్లా? ఆ వయసుకే నేను మిమ్మల్ని పెళ్లిచేసుకుని వచ్చి ఈ సంసారంలో కూరుకున్నది!'' అని మనసులో అనుకుంది సుశీల.

''మమ్మీ టిఫిన్ పెడ్తావా... నేను వెళ్లిపోనా?'' బెదిరింపుగా అడిగాడు రవి.

''కాఫీలో పంచదార సరిపోలేదే!'' అత్తగారు చెప్పింది.

సుశీల పంచదారకోసం వెళ్తూ వుండగా, ''ఇదిగో ఈ గుండీ కాస్త కుట్టిపెట్టూ!'' అంటూ షర్టు అందించి స్నానానికి వెళ్లిపోయాడు రాఘవ.

భర్త చేతిలోంచి షర్ట్ తీసుకుని దారపు రీలుకోసం వెదుకుతూ ''మాధవీ బామ్మకి కాఫీలో ఓ చెంచా పంచదార వెయ్యి'' చెప్పింది సుశీల.

''ఓపక్క టైం అయిపోయి ఛస్తుంటే ఈ పనులొకటీ...'' మాధవి విసవిసా వంటింట్లోకి వెళ్లింది.

అప్పుడే ఏదో కొంపలు మునిగిపోతున్నట్లు గోడమీదనుండి పక్కింటావిడ పిలవడం మొదలెట్టింది. ఆవిడ గొంతు వినగానే అత్తగారు మూతీ మూడు వంకర్లు తిప్పడం సుశీల గమనించింది. ఆవిడ పిలుస్తుంటేకూడా తనేదో తప్పు చేసినట్లుగా చూడడం ఎందుకో సుశీలకి అర్థంకాలేదు.

సుశీల గోడదగ్గరకు వెళ్లి ''ఏవిటండీ?'' అంది అతికష్టంగా ముఖంమీద చిరునవ్వు పులుముకుని.

''పనిలో వున్నారా?'' ఆవిడ అతి తీరుబడిగా బాతాఖానీ మొదలెట్టింది.

''అవునండీ! ప్రొద్దుటిపూట హడావుడి

మీకు తెలిసిందేకదా!'' ఏడవలేని నవ్వొకటి నవ్వుతూ అంది సుశీల.

''అమ్మా పంచదార డబ్బాలో పంచదార లేదు!'' మాధవి రయ్యిన అరిచింది.

''ఆ పెద్దడబ్బాలో వుంటుంది చూడు!... ఆ ఏవిటి చెప్పండి'' సుశీల పక్కింటావిడ్ని తొందరపెట్టింది.

''అబ్బే... ఏమీ లేదు. మీరు గ్యాస్ ఎప్పుడు బుక్ చేశారా అని!''

''గ్యాసా! ఏమోనండీ గుర్తులేదు. మీ సిలిండర్ అయిపోయిందా?''

''లేదు. మనిద్దరమేకదా వెళ్లి బుక్‌చేశాం! అది డిసెంబర్ ఒకటినా లేక పన్నెండునా? అని రాత్రంతా ఆలోచించాను. చివరికి మావారు మిమ్మల్ని అడిగితే తెలుస్తుందికదా అన్నారు''

సుశీలకూడా ఆలోచనలో పడింది. ''ఆరోజు మార్కెట్‌కి కూడా వెళ్లాంకదా! మీ బుజ్జిగాడు స్కూల్‌నుండి వస్తాడని త్వరగా వచ్చేశాంకూడాను! శనివారం అనుకుంటా. అవును శనివారమే!''

''ఒసేయ్... నా కాఫీ ఆరిపోయింది. పంచదార వెయ్యడం ఇష్టంలేకపోతే వెయ్యను అని చెప్పి ఏడవచ్చుకదా!'' అత్తగారి కంఠం ఖంగున మ్రోగింది.

సుశీల గాభరాగా ''ఆ వస్తున్నా... మీకు మధ్యాహ్నం చెప్తానండీ'' అని ఇంట్లోకి నడిచింది. కూర మాడుతున్న వాసన గుప్పున కొట్టింది. ''అరెరే...'' అని ఒక్క పరుగులో వంటింట్లోకి వెళ్తుంటే గడప కాలివేలికి కొట్టుకుని చిట్లి రక్తం వచ్చింది.

''ఏం రన్ చేశావు మమ్మీ! నువ్వేగనుక మా టీంలో వుండుంటే!'' అన్నాడు చప్పట్లు కొడ్తూ రవి.


బాత్‌రూంలోంచి వస్తున్న రాఘవ ''ఆ మాడడం చాల్లే... దించెయ్యి'' అన్నాడు వ్యంగ్యంగా.

సుశీల కోపంగా చూసింది.

''ప్రొద్దుటిపూట అలా గోడలమీదనుండి

# పైలెట్ల పలకరింపు

మనం దారిలో ఒకరికొకరం ఎదురైతే నమస్కారంగానీ, షేక్‌హేండ్‌గానీ ఇచ్చుకుంటాం. ఇదే ఆకాశమార్గంలో ఒక విమానానికి మరొక విమానం ఎదురైతే పైలెట్లు కూడా ఒకరికొకరు అభివాదం చేసుకుంటారు. వారు ఆ సమయంలో తమ రెండు విమానం రెక్కలను కొద్దిగా క్రిందికి వాలే విధంగా చేసి అభినందించుకుంటారు.



-కొడిమెల శ్రీరామమూర్తి (ఏలూరు)

కబుర్లు చెప్పడం మానెయ్యి'' అని వార్నింగ్ ఇచ్చి వెళ్లిపోయాడు.

''నేనేం ఆవిడ్ని పిలవలేదు'' గొణుక్కుంటూ స్టౌ దగ్గరకు వెళ్లింది సుశీల.

కాఫీలో పంచదార వెయ్యలేదని అత్తగారు సణుగుతూనే వుంది. ఆవిడకోసం మళ్లీ కాఫీ కలుపుతూ ''గ్యాస్ బుక్ చేసింది ఎప్పుడబ్బా? డిసెంబర్ ఒకటినా పన్నెండునా?'' అని ఆలోచించడం ప్రారంభించింది. ఇంతలోకి మళ్లీ భర్త ఏ బనీన్‌కోసమో పిలవడంతో 'అనవసరంగా ప్రొద్దుటే ఈ ప్రక్కింటావిడ బుర్ర తినేసింది' అని విసుక్కుంటూ అటు నడిచింది.

భర్తని ఆఫీసుకీ పిల్లల్ని బయటికీ పంపి, పూజ, భోజనాలు పూర్తి చేసేసరికి మధ్యాహ్నం అయిపోతుంది. సుశీలకి హాయిగా పుస్తకం చదువుకుంటూ పడుకోవడం చాలా ఇష్టం! కానీ అంత చిన్న కోరిక కూడా గగన కుసుమమే! నడుం వాల్చగానే ఏ దూరపు బంధువో లేక పక్కింటావిడో, ఎదురింటావిడో ''పనయిందా?'' అని వచ్చి కూర్చుంటారు. విధిలేక వాళ్ల ఎదురుగా కూర్చుని వాళ్లు చెప్పే పనికిరాని కబుర్లన్నీ వినాలి. ఇంతలోకి అత్తగారికి కాఫీ టైం అయిపోతుంది. సాయంత్రం వంటకి కూరలు వున్నాయా లేదా చూసుకోవడం, టిఫిన్ ప్రయత్నాలు చేయడంతో రోజు గడిచిపోతుంది.

ఆరోజు ఆదివారం. అందరికీ శలవు. కానీ సుశీలకి మాత్రం రోజూకన్నా హెచ్చు పని! ఎవరో ఒకరు రావడం, వాళ్లతో మాట్లాడడం, కాఫీలు, టిఫిన్లు, అష్టావధానం, శతావధానంలా వుంటుంది పరిస్థితి. భోజనాలు కాగానే రాఘవ ఎక్కడికో హడావుడిగా తయారై వెళ్లిపోతుంటే ''ఎక్కడికండీ?'' అంది.

''స్టేట్స్‌నుండి మా ఫ్రెండ్ వచ్చాడు. ఇవాళంతా వాడితో గడపాలి అని మా ఫ్రెండ్స్ అందరం నిశ్చయించుకున్నాం'' గొప్పగా చెప్పాడు.

''ఈ రోజు మా అక్కయ్యా వాళ్లింటికి వెళ్లొద్దాం అనుకున్నాం కదండీ!'' అడిగింది సుశీల.

''నెక్స్ట్ వీక్ వెళ్దాంలే! ఇదిగో నేను అలా వెళ్లగానే నువ్విలా అక్కగారింటికి చెక్కేయ్యక మధ్యాహ్నం కాసిని చేగోడీలు చెయ్యి. మా మాధవగాడికి చాలా ఇష్టం! పోయినసారి ఇచ్చినప్పుడు ఎంత ఆనందపడ్డాడో తెలుసుగా!'' అన్నాడు రాఘవ.

సుశీల నిట్టూర్చి వూరుకుంది. మధ్యాహ్నం వస్తున్న నిద్రని బలవంతంగా ఆపుకుంటూ చేగోడీలు చేస్తుండగా, ''ఆంటీ మీకు ఫోన్!'' అని పక్కింటి కుర్రాడు వచ్చి చెప్పాడు.

చేతిలో పని వదిలి సుశీల హడావుడిగా పరుగెత్తింది. ఆమెకి ఫోన్ అనగానే ముచ్చెమటలూ పోస్తాయి. ఎప్పుడూ ఆమె ప్రాణానికి ఫోన్లో చెడువార్తలే చెప్తుంటారు. సుశీల కంగారుగా ''హలో... హలో!'' అంది.

అవతలినుండి నవ్వు గొంతుతో ''నేనే సుమిత్రని... ఎందుకే అంత కంగారు?'' అంది.

సుశీలకి ఒక్కసారిగా ఆశ్చర్యం, ఆనందం ముంచుకువచ్చేశాయి. ''సుమీ... నువ్వేనా... ఎక్కడ్నించి మాట్లాడుతున్నావు?'' అని అరిచింది.

''ఇండియా వచ్చి వారం అయింది. మొదట అమ్మా వాళ్లింటికి వెళ్లి అక్కడ్నించి ప్రస్తుతం మా అత్తగారింటికి వచ్చాను. ఇప్పుడు హైద్రాబాద్‌లోనే వున్నాను. కమలకీ, సరస్వతికీ కూడా ఫోన్ చేశాను. వాళ్లంతా రేపు నా దగ్గరకొస్తున్నారు. నువ్వుకూడా వస్తావని నీకు చేస్తున్నాను. రేపు

తెల్లారేసరికల్లా నువ్వు నా దగ్గర వుండాలి. రేపంతా మనం మళ్లీ కాలేజీ స్టూడెంట్స్ అయిపోయి భూతకాలంలోకి దూసుకుపోవాలి. వర్తమానం గురించి పూర్తిగా మర్చిపోవాలి'' అంది.

''రేపా... మరీ...'' అని సుశీల ఏదో చెప్పబోయింది.

''అవును రేపే! ఎల్లుండి మళ్లీ ఢిల్లీ వెళ్తున్నాను. అన్నయ్య కొడుకు పెళ్లి. అందుకే అంత అర్జంట్. అటునుంచి అమ్మావాళ్ల దగ్గరకు మచిలీపట్నం వెళ్లి ఫస్టకల్లా మళ్లీ మాతృభూమిని వదిలి అత్తభూమి పయనం!'' అంటూ గలగలా నవ్వింది. సుశీల ఇంక ఏమీ మాట్లాడ లేకపోయింది.

''సరే... ఎడ్రస్ చెప్పు!'' అంది.

● ● ●

మరునాడు ప్రొద్దుటే లేచి స్నానంచేసి, పూజ పూర్తిచేసింది సుశీల. మాధవి తల్లి చేసే పనులని ఆశ్చర్యంగా చూసింది. సుశీల బీరువాలోంచి గంధపు రంగు వెంకటగిరి జరీచీర తీసి కట్టుకుంది. ఎక్కడికి కట్టుకు వెళ్లాలో తెలీక ఆ చీర ఐదేళ్లనుంచి మడత విప్పలేదు!

రాఘవకి కాఫీ అందిస్తూ ''నేను సుమిత్ర దగ్గరకు వెళ్తున్నాను. సాయంత్రంవరకూ రాను. కుక్కర్‌లో అన్నం, పప్పు పెట్టాను. ఈ పూటకి కాస్త ఆవకాయతో సర్దుకోండి. అది మళ్లీ ఏ ఐదేళ్లకోగానీ ఇండియా రాదు!'' అంది.

''అమ్మా... నేను ఈ రోజు కాలేజీకి త్వరగా వెళ్లాలి...'' మాధవి రాగం తీసింది.

''నేనూ త్వరగా వెళ్లాలి. రవీ ఓ ఆటో తెచ్చిపెట్టు'' చెప్పింది సుశీల.

రాఘవ లేస్తూ ''నేను స్కూటర్‌మీద డ్రాప్‌చేస్తానులే!'' అన్నాడు.

''అత్తయ్యా నేను ఫ్రెండ్ దగ్గరకి వెళ్తున్నాను. సాయంత్రంవరకూ రాను. భోంచేసాక వంటింటి తలుపు గడియపెట్టేయండి. లేకపోతే పిల్లి దూరుతుంది'' అంది సుశీల.

''ఇంత ప్రొద్దుటే వెళ్లిపోతున్నావా?'' ఆవిడ ఆశ్చర్యంగా చూసింది. సుశీల తల ఊపి ఊర్కుంది.

సుశీల మరోసారి అద్దంలో చూసుకుని



భర్తవెంట బయటకు నడిచింది. రాఘవ ఆమెని ఆటో ఎక్కించి వెనక్కి వచ్చేశాడు. సాయంత్రం దాకా మిత్రురాళ్లకి పొద్దే తెలీలేదు. పాత సంగతులు నెమరేసుకుంటూ, ఒకళ్లని ఒకళ్లు వుడికించుకుంటూ, అంతలోనే మనసుకున్న బిరడాలని తీసి ప్రేమానురాగాలని ఒకళ్లమీద ఒకళ్లు గుమ్మరించుకుంటూ అలసిపోయేవరకు కబుర్లు చెప్పుకున్నారు. కమలా, సరస్వతుల్లా, సుశీల హాయిగా వుండలేకపోయింది. మధ్యాహ్నం అవగానే అత్తగారికి కంటిచూపు ఆనదు గట్టు చివర్న పెట్టిన పెరుగు గిన్నె కనిపించిందో లేదో!'' ఈ రోజు ఆఖరి ఆడపడుచు వస్తానంది. వస్తే కాఫీ ఇచ్చే దిక్కుకూడా లేదని విసుక్కుందేమో, మాధవి కాలేజీనుంచి రాగానే నీరసంగా వాలిపోతుంది. అన్నం బలవంతంచేసి తినిపించాలి. లేకపోతే తినదు! రవి బస్ పాస్‌కి డబ్బులు అడిగితే ఇవ్వడం మరచిపోయి వచ్చేసింది. నడిచి వెళ్లాడో ఏమో! ఆయనకి ఆ చప్పిడి మెతుకులతో కడుపు నిండలేదేమో' ఇలా రకరకాల ఆలోచనలు చుట్టుముట్టి పరధ్యానంలోకి వెళ్లడం, స్నేహితురాళ్లు కసిరి మామూలు లోకంలోకి పడేయాలని ప్రయత్నించడం జరుగుతూనే వుంది. ఇంక ఐదు అవుతుండగా లేచి నిలబడి ''సుమీ... ఇంక నన్ను పంపించు... ఆయన వచ్చే టైం అయింది'' అంది.

''మీ ఆయన్నేం పిల్లి ఎత్తుకుపోదులే. ఇంకో గంట కూర్చో!'' అంది సుమిత్ర. కానీ సుశీల అందుకు సమ్మతించలేదు.

''ఇల్లంతా నానా కంగాళీ చేసిపెడ్తారు. అటు చిన్న పిల్లలూ కాదు. ఇటు పెద్ద పిల్లలూ కాదు. ఇద్దరికీ ఒక్క క్షణం పడదు. ఇల్లు అలా వుంటే ఆయిన విసుక్కుంటారు.'' అంది.

సుమిత్ర లేచి స్నేహితురాలికి మంచి చీరా, జాకెట్టుబట్టా పెట్టి సాగనంపింది.

సుశీల గాభరాగా ఇల్లు ఏ పరిస్థితుల్లో చూడవలసి వస్తుందో అన్న బెరుకుతో ఇంట్లోకి ప్రవేశించింది. అక్కడి వాతావరణానికి ఆమెకి విస్మయం కలిగింది. పొరపాట్న వేరే ఇంట్లోకి వచ్చేసేనేమో అనిపించింది కూడా! మాధవి తమ్ముడ్ని దగ్గర కూర్చోపెట్టుకుని లెక్కలు చెప్తోంది. రాఘవ కాఫీ తాగుతున్నవాడల్లా ''రావోయి... రా మాధవీ అమ్మకి కూడా కాఫీ పట్రా'' అన్నాడు.

మాధవి లేచి లోపలికి వెళ్తూ ''అమ్మా... వంటిల్లు చూసి అదిరిపోతావు అలా సర్దాను చూడు!'' అంది.

''మధ్యాహ్నం వాళ్ల అత్తయ్య వస్తే పకోడీలు వేసింది ఎంత రుచిగా చేసిందనుకున్నావు నా మనవరాలూ!'' అంది అత్తగారు.

''రవీ బస్‌పాస్ తీసుకున్నావా?'' అడిగింది సుశీల.

''ఆ డబ్బులు నాన్నగారి దగ్గర తీసుకున్నామ్మా'' అన్నాడు రవి.

''రాత్రికి వంటకూడా చేసేశాను తెలుసా?'' మాధవి కాఫీ కప్పు అందిస్తూ గర్వంగా చెప్పింది.

సుశీల నీట్‌గా వున్న ఇంటినీ, నవ్వుతున్న వాళ్లమొహాలనీ ఆశ్చర్యంగా చూస్తుండిపోయింది. ఆమెకి ఆ నిమిషంలో తన అమ్మమ్మ చెప్పిన కథ గుర్తొచ్చింది. ''ఒక ఊళ్లో ఓ ముసలమ్మ వుండేది. ఆవిడకి తన కోడీ... కుంపటీ వుంటేగానీ ఊళ్లోవాళ్లకి తెల్లవారదని గొప్ప నమ్మకం వుండేది... ఓనాడు ఏమైందంటే...!!!''